క్లుప్తంగా

హోమియో వైద్యులను నియమించాలి

నేలకొండపల్లి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో హోమియో వైద్యులను వెంటనే నియమించాలని సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వివిధ సమస్యలపై సంబంధిత జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ రోజు ఆస్పత్రికి 50కి పైగా బాధితులు వస్తుండగా.. హోమియో వైద్యులు లేకపోవడం దారుణమన్నారు. వైద్యులను నియమించకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు ఏటుకూరి రామారావు ఉన్నారు.

పరామర్శ..

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు శీలం గురుమూర్తి అనారోగ్యంతో చికిత్సపొంది కోలుకుంటుండగా ఆయన్ను గురువారం యాదవ మహాసభ నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో మహాసభ జిల్లా అధ్యక్షుడు కోడి లింగయ్య, వైరా మార్కెట్ మాజీ చైర్మన్ గుమ్మా రోషయ్య, మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బారి మల్సూర్, ఇతర నాయకులు ఉన్నారు.

డిప్లొమా ఫలితాల్లో 'శ్రీచైతన్య' ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మంరూరల్: మండలంలోని పాన్నేకల్‌లో గల శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ విడుదల చేసి డిప్లొమా 2వ, 4వ, 6వ సెమిస్టర్ల ఫలితాల్లో ఆరుగురు విద్యార్థులకు 10కి 10 ఎస్‌జీపీఏ, 14 మందికి 9.8 ఎస్‌జీపీఏ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎం.శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత పర్యవేక్షణ కళాశాల విధానమని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక, డైరెక్టర్ శ్రీవిద్య, డీన్ సుదర్శన్, ఏఓ వైశాలి, టీపీఓ రాజేష్, ఇన్‌చార్జ్ కృష్ణప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు తదితరులు అభినందించారు.

సొసైటీల బకాయిలపై వివరాలు అందించాలి

ఖమ్మంవ్యవసాయం: కో–ఆపరేటివ్ సొసైటీల నుంచి రావాల్సిన నగదు బకాయి వివరాలను నెల రోజుల్లోగా అందించాలని కోపరేటివ్ సొసైటీ జూనియర్ ఇన్‌స్పెక్టర్/లిక్విడేటర్ ఎస్‌డీ అఖిలా బేగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని పంగిడి ఎస్టీ మహిళ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, ఖమ్మానికి శ్రీ కనకదుర్గ స్టోన్ క్వారీ లేబర్ కాంట్రాక్ట్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, డిస్ట్రిక్ట్ పారామెడికల్ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్‌లను లిక్విడేషన్ చేయడానికి తనను లిక్విడేటర్‌గా నియమించినట్లు తెలిపారు. ఈ మూడు కో ఆపరేటివ్ సొసైటీలకు సంబంధించి ఎవరికైనా నగదు రావాల్సి ఉంటే తగిన ఆధారాలతో లిక్విడేటర్‌కు జిల్లా సహకార అధికారి కార్యాలయంలో తనకు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 96769 00083ను సంప్రదించాలని చెప్పారు.

నగరంలో సినిమాలు

తిరుమల	భైరవం, ఖలేజా
వినోద	సింగిల్
సాయిరాం	కేసరి చాప్టర్ 2
శ్రీనివాస	ఖలేజా
ఆదిత్య	కరాటే కిడ్ లెజెండ్స్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	34		20
కాకర	50	చుక్కకూర	3
బీర	56		20
దొండ	20	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	86	గోంగూర	4
గోరుచిక్కుడు	50		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	56		20
బీట్‌రూట్	26	-ఖమ్మం వ్యవసాయం	



కాల్వను శుభ్రం చేస్తున్న జేసీబీలు

మురుగు కనుమరుగయ్యేలా..

వర్షాకాలం ముందస్తు సన్నాహాలు..

- నగరంలో 20 కిలోమీటర్ల డ్రెయినేజీల శుభ్రతపై దృష్టి
- పూర్తికావొచ్చిన పూడికతీత పనులు
- కచ్చా కాల్వలను శుభ్రం చేయించిన అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాకాలం సమీపించడంతో నగరంలో వరద ముంపు సమస్యలు తలెత్తకుండా ఖమ్మం నగరపాలక సంస్థ (కేఎంసీ) ముందస్తు చర్యలను ముమ్మరం చేసింది. నగరంలోని సుమారు 20 కిలోమీటర్ల పొడవైన డ్రెయినేజీ వ్యవస్థను జేసీబీలతో యుద్ధప్రాతిపదికన శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టగా.. ఇప్పటికే అత్యధిక శాతం పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రధాన స్టోమ్ వాటర్ డ్రెయినేజీలతో పాటు కచ్చా కాల్వల్లో పేరుకుపోయిన మురుగు, చెత్త నిల్వలను తొలగించారు.

నిరంతర పర్యవేక్షణతో..

నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఈ పనులను చేపట్టారు. వర్షపు నీటికి ఎలాంటి అడ్డంకులు లేకుండా సాఫీగా ప్రవహించేలా, ఎక్కడా నీరు నిలిచిపోకుండా ఉండేలా పారిశుద్ధ్య సిబ్బంది, జేసీబీలతో డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను అధికారులు ఏర్పాటు చేసి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

పౌర సేవలే లక్ష్యం..



ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడం, వారి ఆరోగ్య భద్రతను పర్యవేక్షించడం మా ప్రధాన కర్తవ్యం. వర్షాకాలంలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ఈ పనులను వర్షాలు ప్రారంభం కాకముందే పూర్తి చేస్తున్నాం. దాదాపు 20 కిలోమీటర్ల మేర డ్రెయినేజీలను జేసీబీలతో శుభ్రం చేయిస్తున్నాం. ప్రజలు కూడా సహకరించి డ్రెయినేజీల్లో చెత్త వేయకుండా ఉండాలి.

– పునుకొల్లు నీరజ, మేయర్, కేఎంసీ

గత అనుభవాలతో..



ఖానాపురం ప్రాంతంలోని కచ్చా కాల్వ

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందుగానే శుభ్రం చేయిస్తున్నారు. ఇప్పటికే వరద ముంపు ఉన్న ప్రాంతాలను గుర్తించిన అధికారులు ఆయా ప్రాంతాలపై పూర్తిస్థాయిలో పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారుల వెంట ఉన్న పెద్ద డ్రెయినేజీలు, కాలనీలలో ఉన్న చిన్న మురుగు కాల్వల్లోని మురుగును తొలగిస్తున్నారు.

పేద విద్యార్థులపై ప్రభుత్వానికి చిన్నచూపు



డిప్యూటీ సీఎంకు విన్నవిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలలను మూసివేసి ప్రభుత్వం పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర చేస్తుందని, పేద విద్యార్థులంటే ప్రభుత్వానికి చిన్నచూపని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, టి.ప్రవీణ్, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మందా సురేష్ అన్నారు. గురువారం ఎస్సీ గురుకులాలను మూసివేయొద్దని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సవితి తల్లి ప్రేమను కనబరుస్తుందని ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూసుమంచి బాలికలు, సత్తుపల్లి బాలురు, భద్రాచలం బాలికలు ఇంటర్మీడియట్ కళాశాలలో విద్యార్థులు లేరనే సాకుతో కళాశాలల మూసివేత నిర్ణయం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని విరమించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు గోపి, త్రినాథ్, ఉదయ్, అజయ్, ప్రతాప్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జెండా దిమ్మెను కూల్చివేస్తే ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నేలకొండపల్లి: బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మెను కూల్చివేయాలని చూస్తే సహించబోమని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య పేర్కొన్నారు. మండలంలోని కొత్తకొత్తూరులో గురువారం వారు మాట్లాడుతూ గ్రామంలో కొత్తగా నిర్మించిన జెండా దిమ్మెను జూన్ 2న ఆవిష్కరించేందుకు సిద్ధమవుతుండగా కొందరు కూల్చేందుకు కుట్ర పన్నారని తెలిపారు. ఈ విషయంలో అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గవద్దని సూచించారు. నాయకులు కోటి సైదారెడ్డి, నాగుబండి శ్రీనివాసరావు, తన్నీరు కృష్ణమూర్తి, నెల్లూరి లీలాప్రసాద్, కమదన ప్రవీణ్, మస్తాన్‌రెడ్డి, యాతాకుల భాస్కర్, బట్టపోతుల ప్రకాశం, ప్రశాంత్, మరికంటి రేణుబాబు, సాగి రామారావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు ప్రారంభం



వేడుకలో పాల్గొన్న గ్రామస్తులు

కామేపల్లి: మండలంలోని మద్రిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి, ముత్యాలమ్మతల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం మొదటి రోజు మహోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఉప్పల సాగర్‌శర్మ ఆధ్వర్యాన వేదమంత్రోచ్చరణల నడుమ గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, పంచగవ్యప్రాశన, యాగశాల ప్రవేశం, అఖండ దీపాస్థాపన, వాస్తుపూజ, మండపారాధన వంటి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అంభయాంజనేయస్వామి దేవాలయ నిర్మాణ దాత దిరిశాల నరేష్‌చౌదరి, స్వాతి దంపతులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే నెలలో జరగాల్సిన గౌడ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన, బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ కోరారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గౌడ జాతిని రక్షించడానికి, అభివృద్ధి బాట పట్టించడానికి, జాతి పిల్లల భవిష్యత్ కోసం గౌడ జాతి చైతన్యవంతం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను చేజిక్కించుకునేందుకు నగరంలో స్థలం కేటాయించిందని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు కత్తి నేహ్రూ, బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి, గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి బొలగాని శ్రీనివాసరావు, జి.శ్రీనివాస్, లింగయ్య, యాదగిరి, వెంకన్న, అమరగాని వెంకన్న, బొడపట్ల వెంకన్న, బిచ్చాల తిరుమలరావు, డాక్టర్ రాజశేఖర్, యరకల సైదులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంలో అలసత్వం వహించొద్దు



సూచనలు చేస్తున్న కార్పొరేటర్ కోటేశ్వరరావు

ఖమ్మం అర్బన్: నగరంలోని 6వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులతో పాటు పారిశుద్ధ్య పనులను కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని, పారిశుద్ధ్య విషయంలో అలసత్వం వహించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయిన్లను శుభ్రం చేయించి లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

'ఉపాధి' కూలీ రూ.600 చెల్లించాలి

రఘునాథపాలెం: ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 తగ్గకుండా చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని గణేశ్వరం, జింకలతండా, మంచుకొండ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి పనులు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నాక మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ, కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేడు శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి పనులను పునరుద్ధరించి పని ప్రదేశాల్లో టెంట్‌లు, మెడికల్ కిట్లు, పారలు, గడ్డపారలు తదితర సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు తిరుపయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల సరఫరా



పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ శైలజలక్ష్మి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేసినట్లు ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజలక్ష్మి తెలిపారు. గురువారం ఖమ్మం అర్బన్ ఎంఈఓ కార్యాలయం నుంచి ప్రభుత్వ బాలికల పాఠశాల, రిక్కాబజార్, శాంతినగర్, మామిళ్లగూడెం, బల్లేపల్లి, వెలుగుమట్ల పాఠశాలలకు సరఫరా చేశామన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజునే పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించిన క్రమంలో ఆయా పాఠశాలలు వారు వచ్చి పుస్తకాలను తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సిబ్బంది హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు డయల్ యువర్ డీఎం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు సలహాలు స్వీకరించేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం దినేష్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ప్రయాణికులు శుక్రవారం సాయంత్రం 4గంటలనుంచి 5 గంటల వరకు 99592 25958 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూసుమంచి: విద్యుత్ మరమ్మతు పనుల నిమిత్తం నేడు(శుక్రవారం) కూసుమంచిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. దీంతో సాయంత్రం 3 గంటల నుంచి 5.30 వరకు విద్యుత్ నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేబుల్ ఆపరేటర్ల సమావేశం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న టీవీ, ఇంటర్‌నెట్ కేబుల్ యజమానుల(ఆపరేటర్ల)తో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఇల్లెందు క్రాస్ రోడ్‌లో ఉన్న విద్యుత్ గెస్ట్‌హౌస్‌లో సమావేశం నిర్వహిస్తున్న ఖమ్మం ఎస్పీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని విద్యుత్ అధికారులు పాల్గొనే ఈ సమావేశానికి ఇంటర్‌నెట్, టీవీ సేవలు అందిస్తున్న యజమానులు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి ఆర్ఎస్ఎస్ ప్రారంభిక్ శిక్ష వర్గ్..

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఈనెల 30, 31, జూన్ 1వ తేదీల్లో ఆర్ఎస్ఎస్ ప్రారంభిక్ శిక్ష వర్గ్ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, పబ్లిక్ స్పీకింగ్ సమాచారం, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, కథలు, భౌగోళిక అంశాలు, భారతీయత, దేశ భక్తి తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం ఉంటుందన్నారు.

కుట్టు మిషన్ అందజేత



కుట్టుమిషన్ అందిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: వాసవీ క్లబ్ఇంటర్‌నేషనల్ వైస్ ప్రెసిడెంట్ రేగూరి హనుమంతరావు పుట్టిన రోజు సందర్భంగా మండల కేంద్రంలో పేద ఆర్యవైశ్య మహిళకు కుట్టు మిషన్ అందించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ కార్పొరేటర్ పసుమర్తి రామోహ్మన్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు నాగుబండి శ్రీనివాసరావు, ఎస్ఐ సంతోష్, రాధాకృష్ణ, వరప్రసాద్, దివాకర్ గుప్తా, దోసపాటి చంద్రశేఖర్, మాటూరి సుబ్రహ్మణ్యం, ఎర్ర కోటి, రేగూరి వాసవి, దోసపాటి ఉషారాణి, కొత్త కరుణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్ బాలపేట ప్రాంతానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని గురువారం కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్ పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో మంజూరైన ఈ చెక్కులను ఎం.అంజలికి రూ.23వేలు, వడ్లమూడి స్వప్నకు వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



కామేపల్లి: రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: నకిలీ విత్తనాలు అమ్మి మోసం చేస్తే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్ఐ కూచిపూడి జగదీష్ హెచ్చరించారు. గురువారం మండలంలోని తిరుమలాయపాలెం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ ఫామ్‌లో ఉన్న విత్తనాలను మాత్రమే అమ్మాలని, ప్రతీ రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. లైసెన్సులు లేకుండా గ్రామాల్లో విత్తనాలు విక్రయిస్తుంటే వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ వారికి తెలియజేయాలని, రైతులకు మాత్రమే కలుపు మందులు అమ్మాలని కోరారు. మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి విత్తన చట్టంపై డీలర్లకు అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో విత్తన షాపులను సందర్శించి బిల్ బుక్కులు, స్టాక్ రిజిస్టర్లు, ఓ ఫామ్స్, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. బీటీ 1, బీటీ 2 విత్తనాలు మాత్రమే అమ్మకాలు నిర్వహించాలని ఎవరైనా బీటీ 3 విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

నకిలీపై అప్రమత్తంగా ఉండాలి..

కామేపల్లి: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ తారాదేవి, ఎస్ఐ సాయికుమార్ అన్నారు. గురువారం మండలంలోని తాళ్లగూడెంలో వ్యవసాయ, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యాన విత్తన దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విత్తనాల విక్రయాల విషయంలో డీలర్లు పాటించాల్సిన నియమాలను వివరించారు. రైతులు లైసెన్స్ పొందిన విత్తన దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ప్రతి ప్యాకెట్‌కు రశీదు ఇవ్వాలన్నారు.

గురుకుల సెక్రటరీ వ్యాఖ్యలపై ఆగ్రహం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: పిల్లల చేత పనులు చేయించి టాయిలెట్లను శుభ్రం చేయించి దళిత విద్యార్థులను అవమానపర్చిన గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ సోషల్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ల సత్యం డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల వారు అన్ని రంగాల్లో రాణిస్తుంటే అది చూసి ఓర్వలేక ఒక అధికారి ప్రవర్తన యావత్ దళిత జాతిని అవమానపరిచేలా ఉన్నదన్నారు. దళిత పిల్లలు ఏమైనా రాజ సింహాసనం నుంచి వచ్చారా.. వారేమైనా రాజుల అన్నట్టు వెటకారంగా మాట్లాడిన సెక్రటరీని వెంటనే సస్పెండ్ లేదా ఆమె స్థానాన్ని మార్చాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

దిష్టిబొమ్మ దహనం..

సోషల్ వెల్ఫేర్ గురుకుల రాష్ట్ర సెక్రటరీ అలుగు వర్షిణి గురుకుల విద్యార్థులపై అనుచిత వాక్యాలను నిరసిస్తూ పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఆమె దిష్టిబొమ్మను ఖమ్మం మున్సిపాలిటీ సెంటర్‌లో గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు లక్షణ్‌లు మాట్లాడుతూ.. 40ఏళ్ల సోషల్ వెల్ఫేర్ గురుకుల చరిత్రలో ఇంతటి మానవత్వం లేని సెక్రటరీని ఎక్కడ కూడా చూడలేదని మండిపడ్డారు. అలుగు వర్షిణి వాక్యాలను వెనక్కి తీసుకోవాలని, తక్షణమే ఆమెను విధుల నుంచి తొలిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు యశ్వంత్, సందీప్, ప్రాణవ్, ప్రసాద్, వెంకటేష్, జీవన్, మాజీ రాష్ట్ర నాయకులు మురళి, తిమ్మిడి రఘు, నసీర్, అనిల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అహల్యాబాయి జయంతి వేడుకలు



చేనేత కార్మికుడిని సన్మానిస్తున్న రజినీరెడ్డి

తిరుమలాయపాలెం: మహారాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కాకరవాయి గ్రామంలో బీజేపీ మహిళ నాయకురాలు తమిర రజినీరెడ్డి 30 మంది చేనేత కార్మికులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళపల్లి నరేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి నల్లగట్టు ఉపేందర్, మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొడ్డుపల్లి ప్రసాద్, నల్లగట్టు శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు ఇందూరి మహేష్, గుండా గోవర్ధన్, గుండా ఆంజనేయులు, చేనేత సంఘం అధ్యక్షుడు గుడూరు శ్రీనివాస్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఐలమ్మకు అవమానం..



తెలంగాణ ఉద్యమకారిణి, వీర వనిత, తొలి భూ పోరాటానికి నాంది పలికిన చాకలి ఐలమ్మకు అవమానం జరిగింది. రహదారి విస్తరణలో భాగంగా రెండేళ్ల క్రితం మండల కేంద్రంలో ఉన్న ఐలమ్మ విగ్రహాన్ని ఉన్న చోట నుంచి తీసి పక్కన పెట్టారు. మళ్లీ రహదారి పనులు ముగిసి చాలా కాలం అవుతున్నా సదరు కాంట్రాక్టర్ ఇంతకు ముందున్న స్థానంలో పెట్టకుండా మురికి కాలువ పక్కన పెట్టి నిర్లక్ష్యంగా వదిలేశారు. అధికారికంగా ఐలమ్మ జయంతిని నిర్వహిస్తున్న అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ఉద్యమకారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విగ్రహాన్ని తొలగించిన స్థానంలోనే ఉంచి ఐలమ్మ గౌరవాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు. - నేలకొండపల్లి